తులు మీద, ఇంకా ఎక్కడ బాగా కనిపిస్తుందో అక్కడ సిగరెట్‌తో వాతలు పెట్టింది.

"ఇదిగో మిస్టర్, నీకు నాతో పెళ్ళి అయినట్టుగా గుర్తులు పెట్టాను నీ వంటి నిండా. మళ్ళీ పెళ్ళి చేసుకునే ముందు ఈ వాతలు ఏమిటని అడుగుతారు. అప్పుడు ఇలాగ నన్ను పెళ్ళి చేసుకున్నట్టు "తొలి అనుభవంలా లేదని" నన్ను వదిలేసినట్టు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నానని చెప్పు. తెలిసిందా బాస్టర్డ్! నీకు తొలి అనుభవం అంటే తెలుసునా? ఎంత మంది అమ్మాయిలతో తొలి అనుభవం చవిచూశావ్? రాస్కెల్!" అంటూ పళ్ళు కొరుకుతూ సిగరెట్ అతని కళ్ళ దగ్గరకు తీసుకు వెళ్ళబోయి ఆగిపోయింది.

బయటకు వెళ్ళబోతూ అతని నోట్లో గుడ్డ తీసేసి తలుపు దగ్గరకు వేసి వెళ్ళిపోయిందా అమ్మాయి.

—o—

## డాగ్ టెయిల్

సమయం రాత్రి పదిగంటలు.

స్థలం మూర్తి పడక గదిలో డబుల్‌కాట్. డబుల్‌కాట్ మీద మెత్తని పరుపు, మెత్తని పరుపుమీద మెత్తని, సుతిమెత్తని భార్యామణి.

ఆమె అటుతిరిగి పడుకుంది. మూర్తికి మన్మథబాణాల జోరు మొదలైంది. అతని భార్యకి ఇవేమీ పట్టనట్లుగా పడుకుంది.

మూర్తి మొదటి ప్రయత్నంగా ఆమెమీద చేయి వేశాడు.

బ్యాట్‌మెంటన్‌లో అవతల కోర్టులోకి వెళ్ళిన బంతిలా మూర్తి చెయ్యి విసురుగా వెనక్కి తిరిగి వచ్చింది—అయినా తనలోని కాముని పోరు పడలేక మళ్ళీ ఇంకో ప్రయత్నం చేశాడు. ఇందుకు ముందుకన్నా వేగంగా చెయ్యి వెనక్కు తిరిగి కొట్టబడింది.

చెయ్యి వెయ్యడమేమిటి? తన భార్యమీద తనకు సర్వాధికారాలు

ఉన్నాయనుకుని, ఒకేసారి ఆమెను తనవేపుకు తిప్పుకోడానికి ప్రయత్నం చేశాడు.

"ఛీ—" అందామె.

ఏమిటి? తనను కుక్కను కసిరినట్లు "ఛీ" అంటుందా? పెద్ద తను లేకుండా, తన పొందులేకుండా ఉండలేననుకుంటూందేమో, ఇలా కాదు. తనే దగ్గరకువచ్చి బ్రతిమాలి "కావాలండీ" అనే వరకూ భీష్మించుకుని కూర్చోవాలి.

"ఈ ఉద్యమం ఈ క్షణంనుంచే ప్రారంభం" అని మూర్తి పిడికెలి బిగించాడు.

రేపటినుంచి ఇటువంటి కోరిక కలిగితే వాత పెట్టుకోవాలి.

కాషాయ రంగు బట్టలు వేసుకోవాలి.

ఉప్పుకారం తక్కువ తినాలి.

అసలు తనవేపే చూడకూడదు.

మరి ఆమెతో పనులు ఎలాగా?

తనని చూడకుండా పనులు చేసుకుంటేసరి. సాధ్యమైనంతవరకూ మాట్లాడకుండా ఉంటేసరి. అంతే మూర్తి మరోవైపుకు తిరిగి, బిగుసుకుని పడుకున్నాడు.

మూర్తి భార్య అతన్ని గమనిస్తోంది.

ఈయనగారు ఈ నిగ్రహశక్తి ఎంతసేపు ప్రదర్శిస్తారో చూడాలనుకుంది.

ఆయన అటూ, ఆమె ఇటూ, ఒక గంట గడిచింది.

ఆ తరువాత....

ఆమె తన ఒకకాలు మూర్తి మీదవేసి ఒక నొక్కు నొక్కింది.... అంతే ఎండలో పెట్టిన మంచుముక్కలాగ మూర్తి కరిగి నీరైపోయాడు. వెంటనే మూర్తి భార్య అతని గాఢ పరిష్వంగంలో వాళ్ళ వెచ్చని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

మరి సన్యాసం....కాషాయ వస్త్రాలు. తరువాత చూద్దాంలే అనుకుంటున్నాడు మూర్తి.

—o—